క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి రూ.10లక్షల విరాళం



మధుసూదన్‌రెడ్డిని సన్మానిస్తున్న మల్లాపూర్ తండావాసులు

కొత్తూరు: మండల పరిధిలోని మల్లాపూర్ తండాలో నిర్మిస్తున్న హనుమాన్ ఆలయ గోపుర నిర్మాణానికి మాజీ ఎంపీపీ మధుసూదన్ రెడ్డి రూ.10లక్షల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మధుసూదన్‌రెడ్డిని గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు రవినాయక్, రాందాస్‌నాయక్, రాజు, నాయకులు మల్లేష్, శ్రీరాములు, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న నాయకులు, గ్రామస్తులు

చేవెళ్ల: మండల పరిధిలోని రావులపల్లిలో శనివారం సీసీ రోడ్డు నిర్మాణ పనులను కేసారం మాజీ సర్పంచ్ శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే నిధులతో ఈ రోడ్డు నిర్మాణం చేపడుతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల మార్కెట్ కమిటీ డైరెక్టర్ సుదర్శన్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కిష్టయ్య, గ్రామస్తులు బాలయ్య, బుచ్చయ్య, హనుమంత్‌రెడ్డి, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

మార్మోగిన మల్లన్న నామస్మరణ



హోమంలో పాల్గొన్న దంపతులు

మొయినాబాద్ రూరల్: మండల పరిధిలోని అజీజ్‌నగర్ గ్రామం మల్లన్నస్వామి నామస్మరణతో మార్మోగుతోంది. గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ మల్లన్నస్వామి, భ్రమరాంబిక దేవి ఆలయ ప్రారంభోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శనివారం రెండో రోజు ప్రత్యేక పూజల అనంతరం పలువురు దంపతులు హోమం చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శనం చేసుకున్నారు. అనంతరం అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

ఆమనగల్లు: మున్సిపల్ పరిధి విఠాయిపల్లి గ్రామానికి చెందిన ప్రభావతికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో సీఎం సహాయనిధి పథకం కింద రూ.39 వేల చెక్కు మంజూరు అయింది. మాజీ సర్పంచ్ పర్వతాలు, కాంగ్రెస్ నాయకులు వెంకట్‌రెడ్డి శనివారం ఆమెకు చెక్కు అందజేశారు. కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్‌నాయక్, కృష్ణ, రవీందర్, సంజీవ్, శంకర్ పాల్గొన్నారు.

సమాజ సేవే లక్ష్యం

ఆమనగల్లు: సమాజ సేవే రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ లక్ష్యమని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు జర్పుల దశరథ్‌నాయక్ అన్నారు. కడ్తాల్ మండల కేంద్రంలోని సాలార్‌పూర్, నార్లకుంటతండా, కరాయితండా, చెన్నారం, చల్లంపల్లి, కడ్తాల్ గ్రామాల్లో శనివారం ఆయన పర్యటించారు. ఇటీవల మృతిచెందిన వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ట్రస్ట్ తరఫున రూ.75 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఎంపీటీసీ మాజీ సభ్యులు లచ్చిరాంనాయక్, ప్రియ, మాజీ సర్పంచ్‌లు హరిచంద్ నాయక్, పూజ, నరేందర్‌నాయక్, కృష్ణయ్య, నాయకులు రమేశ్, సాయిలు, దేవ, రాంచందర్, బాబా, జంగయ్య, రమేశ్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ శ్రేణుల సమీక్ష నేడు

యాచారం: బీఆర్‌ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం ఆదివారం మండల కేంద్రంలో జరగనుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కర్నాటి రమేష్‌గౌడ్ తెలిపారు. ఉదయం 11 గంటలకు సాయి శరణం ఫంక్షన్ హాల్‌లో నిర్వహించే సమీక్షకు మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర నాయకులు క్యామ మల్లేశ్, మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్‌రెడ్డిలు హాజరవుతారని, మండల పరిధి పార్టీ శ్రేణులు అందరూ రావాలని ఆయన కోరారు.

పథకాలను వినియోగించుకోవాలి

చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య



శంకర్‌పల్లి: గోదాంను ప్రారంభిస్తున్న కాలె యాదయ్య తదితరులు

చేవెళ్ల/శంకర్‌పల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. శనివారం ఆయన మండల పరిధిలోని జన్వాడలో నూతనంగా నిర్మించిన పీఏసీఎస్ మీటింగ్ హాల్, మహాలింగాపురంలో వేయి మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో నిర్మించిన గోదాంను డీసీసీబీ చైర్మన్ సత్తయ్య, డీసీఎంఎస్ చైర్మన్ కృష్ణారెడ్డితో కలిసి ప్రారంభించారు. త్వరలో పదవీ కాలం ముగియనున్న జన్వాడ, శంకర్‌పల్లి పీఏసీఎస్ చైర్మన్లతో పాటు డైరెక్టర్లను అతిథులు ఘనంగా సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం రుణ మాఫీ, రైతు భరోసా, కనీస మద్దతు ధరలను కల్పిస్తోందన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి, శంకర్‌పల్లి పీఏసీఎస్ చైర్మన్ శశిధర్‌రెడ్డి, జన్వాడ పీఏసీఎస్ చైర్మన్ అరవింద్‌రెడ్డి, వ్యవసాయాధికారులు, సొసైటీ డైరెక్టర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పామెనలో బోనాలు

ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలని, తద్వారా మానసిక ప్రశాంతత చేకూరుతుందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. చేవెళ్ల మండల పరిధిలోని పామెన గ్రామంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న దుర్గమ్మ, సరోజనమ్మ, మైసమ్మ దేవతల విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాల్లో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూధన్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. శనివారం మహిళలు భారీ ఎత్తున బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. పోతురాజుల నృత్యాలు, శివసత్తుల పూనకాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ప్రతాప్‌రెడ్డి, గ్రామస్తులు గోపాల్‌రెడ్డి, మల్లారెడ్డి, సత్తయ్య పాల్గొన్నారు.



వైభవంగా కల్యాణోత్సవం

భీష్మ ఏకాదశి సందర్భంగా పట్టణంలోని శివమారుతీ గీతా అయ్యప్ప మందిరంలో శనివారం శ్రీగిరిజామృతాలింగేశ్వర స్వామి(శివపార్వతుల) కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ లష్కర్ ఆంజనేయులు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కల్యాణోత్సవానికి భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో గురుస్వామి గిరీషన్ నాయర్, లక్ష్మయ్య, నందీశ్వర్, కృష్ణయ్య, వీరశైవ సమాజం సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు. – షాద్‌నగర్ రూరల్

16న భవన నిర్మాణ రంగ మహాసభ

ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి



వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న రామస్వామి తదితరులు

షాబాద్: ఈ నెల 16న నిర్వహించే భవన నిర్మాణ రంగ మహాసభను విజయవంతం చేయలని ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కె.రామస్వామి పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలో ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామస్వామి మాట్లాడుతూ.. బంజారాహిల్స్ లోటస్ పాండ్‌లోని రావినారాయణరెడ్డి ఆడిటోరియంలో నిర్వహిస్తున్న భవన నిర్మాణ రంగ మూడవ సభలకు కార్మికులు పెద్ద ఎత్తున హాజరవ్వాలని కోరారు. దేశవ్యాప్తంగా 10 కోట్లకు పైగా కార్మికులకు 60 ఏళ్లు దాటిన తర్వాత పెన్షన్‌తో సహా అన్ని సదుపాయాలు కల్పించాలని.. లేబర్ అడ్డాల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, బీటసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లేశ్, భవన నిర్మాణ కార్మిక సంఘం మండల కన్వీనర్ శేఖర్, కో కన్వీనర్ అంజయ్య, సీపీఐ మండల కార్యదర్శి జంగయ్య, ఏఐటీయూసీ మండల కార్యదర్శి నారాయణ, నాయకులు రఘు, మధు, రాములు, శ్రీనివాస్ తదితరులున్నారు.



షాబాద్: టపాసులు కాల్చుతున్న నాయకులు



చేవెళ్ల: కేఎస్ రత్నం ఆధ్వర్యంలో విజయోత్సవాలు

తెలంగాణలోనూ సత్తా చాటుతాం

చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం

చేవెళ్ల: త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ బీజేపీ సత్తా చాటుతామని చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం అన్నారు. శనివారం ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో బీజేపీ విజయం సాధించడంతో పట్టణంలో గెలుపు సంబురాలు నిర్వహించారు. నాయకులు మిఠాయిలు పంచారు.

రాష్ట్రంలో బీజేపీ జెండా ఎగురవేస్తాం

షాబాద్: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలోనూ బీజేపీ ఎగురవేస్తామని పార్టీ మండల అధ్యక్షుడు మద్దూరు మాణెయ్య అన్నారు. శనివారం ఢిల్లీ అసెంబ్లీ ఫలితాల్లో బీజేపీ విజయం సాధించిన సందర్భంగా టపాసులు కాల్చి సంబురాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి శ్రీధర్‌రెడ్డి, నాయకులు అనంతం, సత్యనారాయణ, నారాయణ, మహేందర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, మురళి, సందీప్, నరేష్, మల్లేష్, బాలయ్య, రాంచంద్రయ్య, శివ, రాకేష్, మల్లికార్జున్, రాజకుమార్, తదితరులున్నారు.



కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడలో..

శంకర్‌పల్లి చౌరస్తాలో..

శంకర్‌పల్లి: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో బీజేపీ విజయఢంకా మోగించడంతో శనివారం శంకర్‌పల్లిలో బీజేపీ నాయకులు సంబురాలు జరుపుకున్నారు. పెద్ద ఎత్తున బాణా సంచా పేల్చి, మిఠాయిలు తినిపించుకున్నారు. మోదీ, బీజేపీకి అనుకూలంగా నినాదాలు చేశారు. బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. ఇటీవల జరుగుతున్న ఎన్నికల్లో దేశంలోని పలు రాష్ట్రాల్లో బీజేపీ విజయం సాధించడం ఎంతో ఆనందంగా ఉందని, తెలంగాణలో వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు దయాకర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు వాసుదేవ్ కన్నా, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, బయానంద్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆమ్ ఆద్మీ పార్టీకి గుణపాఠం

కొందుర్గు: ఢిల్లీలో బీజేపీ విజయం సాధించిన సందర్భంగా శనివారం కొందుర్గు, జిల్లేడ్‌చౌదరిగూడ మండల కేంద్రాల్లో పార్టీ మండల అధ్యక్షుడు ఎదిర రాజు ఆధ్వర్యంలో సంబురాలు నిర్వహించారు. టపాసులు కాల్చి మిఠాయి పంచుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ.. ఢిల్లీ ప్రజలకు అవినీతి ఆమ్‌ఆద్మీపార్టీకి తగిన గుణపాఠం చెప్పారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు లక్ష్మీకాంత్ రెడ్డి, నాయకులు సుధాకర్ రావు, కుర్మయ్య, లక్ష్మయ్య గౌడ్, శివారెడ్డి, ప్రభులింగం పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

గుడిమల్కాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చంద్రశేఖర్



హైతాబాద్ జెడ్పీహెచ్‌ఎస్ ఆవరణలో మొక్క నాటుతున్న చంద్రశేఖర్

షాబాద్: పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత అని గుడిమల్కాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్ అన్నారు. శనివారం మండల పరిధిలోని హైతాబాద్‌లో తువక్కం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రైతువేదిక, ప్రభుత్వ పాఠశాల ఆవరణలో మియావాకి సిస్టం ప్లాంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అతిథులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించి భావితరాలకు బంగారు బాటలు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ రాజేశ్వరి, పాఠశాల ఉపాధ్యాయ బృందం, గ్రామస్తులు వెంకట్‌రెడ్డి, మహ్మద్ అహ్మద్, జానీ, శ్రీరాములు, సత్తయ్య, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు ఆటల్లోనూ రాణించాలి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న మహేశ్

ఆమనగల్లు: విద్యార్థులు, యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు ఒగ్గు మహేశ్ అన్నారు. పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న మండల స్థాయి వాలీబాల్ పోటీలను శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఆటల్లో గెలుపోటములు సహజమని, స్నేహభావంతో ఆడి, క్రీడాస్ఫూర్తిని నింపాలని సూచించారు. అంతకు ముందు క్రీడాకారులకు డ్రెస్సులు అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు ఎనుమల రమేశ్, పవన్‌కుమార్, మహేందర్, లయన్స్‌క్లబ్ ఉపాధ్యక్షుడు పాపిశెట్టి రాము, ఆర్గనైజర్లు జగన్, మనోహర్‌రెడ్డి, రాజు, రవి, చాంద్‌పాష, సురేశ్, పవన్, గోపి, సందీప్, ఎంఈఓ పాండు, ఉపాధ్యాయులు దూసకంటి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.


బదిలీపై వెళ్లిన ఎస్సైలకు సన్మానం



ఎస్‌ఐలు శివారెడ్డి, శిరీషను సన్మానిస్తున్న నాయకులు

మొయినాబాద్ రూరల్: మొయినాబాద్ ఠాణా పరిధి హిమాయత్‌నగర్ సెక్టార్‌లో పనిచేసిన ఎస్‌ఐలు శివారెడ్డి, శిరీషను పలువురు నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజలకు ఉత్తమ సేవలు అందించిన వారిని ఎప్పటికీ మరిచిపోలేమన్నారు. వారు భవిష్యత్‌లో మరింత ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శాంతి యువజన సంఘం మాజీ అధ్యక్షుడు, కాంగ్రెస్ మండల నాయకుడు నర్సింహ, మహేందర్‌యాదవ్, నరేష్‌గౌడ్, రాఘవేందర్‌యాదవ్, చలపతి తదితరులున్నారు. శివారెడ్డి షాద్‌నగర్ టౌన్‌కు, శిరీష చేవెళ్లకు బదిలీ అయ్యారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు



హోమం చేస్తున్న భక్తులు

ఆమనగల్లు: తలకొండపల్లి మండలం వెల్జాల శ్రీ వేదాద్రి లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా రెండో రోజు శనివారం స్వామివారికి ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. ఆలయ ప్రధాన ధర్మకర్త గూడ యాదగిరి నృసింహశర్మ, నిర్వాహకులు శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో ఉత్సవాలు జరుగుతున్నాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. అనంతరం నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. ఉత్సవాల్లో మాజీ ఎంపీపీలు శ్రీనివాస్‌యాదవ్, నిర్మల, మాజీ సర్పంచ్ సంగీత, జెడ్పీ కోఆప్షన్ మాజీ సభ్యుడు ముజుబుర్ రెహ్మాన్, నాయకులు అంబాజీ, విష్ణువర్ధన్ యాదవ్, నరేందర్‌గౌడ్, యాదయ్య, రాజుగుప్తా, మోహన్‌రెడ్డి, సంపత్, శ్రీశైలం, శేఖర్, ఆంజనేయులు, లింగం తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి వేణుగోపాల స్వామి జాతర

మంచాల: మండల పరిధి ఆరుట్ల గ్రామంలో వెలసిన శ్రీ వేణుగోపాల స్వామి జాతర నేటి నుంచి ప్రారంభం కానుంది. తొలి రోజు ఆదివారం ఉదయం 7 గంటలకు కలశ స్థాపన అంకురార్పణ, సాయంత్రం 5 గంటలకు అధివాస హోమం నిర్వహించనున్నారు. రోజువారి వివరాలు ఇలా ఉన్నాయి. 10న ఉదయం 7.45 గంటలకు యంత్ర ప్రతిష్ఠాపన, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన, పూర్ణాహుతి హోమం. మంగళవారం రాత్రి 8.30 గంటలకు స్వామి వారి కల్యాణం. 12న హోమం, 13న ఉదయం 6.30 గంటలకు స్వామివారి రథోత్సవం. 14న ఉదయం 7.30 గంటలకు హోమం, సాయంత్రం 5.30 గంటలకు నాగవల్లి కార్యక్రమం. రథోత్సవం రోజున స్వామివారి భజన మండలి ఆధ్వర్యంలో భక్తి పాటలు, కోలాట ఆటలు ప్రదర్శించనున్నారు.

కడ్తాల్‌లో బ్రహ్మోత్సవాలు షురూ

ఆమనగల్లు: కడ్తాల్ మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీ చెన్నకేశవ ఆలయంలో శనివారం బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవ నిర్వాహకులు మెళ్లూరి వెంకటేశ్వరశర్మ నేతృత్వంలో విశ్వక్ సేనపూజ, అంకురార్పణ, అఖండ దీపారాధన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాల్లో మార్కెట్ చైర్మన్ గీత, వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ గంప వెంకటేశ్, మాజీ సర్పంచ్‌లు జీఎల్‌ఎన్ రెడ్డి, వేణుగోపాల్, జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ రామకృష్ణ, ఆలయ కమిటీ చైర్మన్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



హైతాబాద్ జెడ్పీహెచ్‌ఎస్ ఉపాధ్యాయులు, విద్యార్థులు

షాబాద్: షాబాద్ మండల పరిధిలోని హైతాబాద్ ఉన్నత పాఠశాల శనివారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా తోటి విద్యార్థులకు విద్యా బోధన చేశారు. వారిని ఉపాధ్యాయులు అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా ప్రజాప్రతినిధులుగా రాజకీయ నాయకులుగా వ్యవహరించి అలరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం వసంత, ఉపాధ్యాయులు, పల్లె అనంతరెడ్డి, బాబయ్య, మురళీధర్ తదితరులున్నారు.

ఆలయ నిర్మాణ పనులు ప్రారంభం



పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తదితరులు

హయత్‌నగర్: తుర్కయంజాల్ మున్సిపాలిటీ మునుగనూరులో నూతనంగా నిర్మించ తలపెట్టిన శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయ నిర్మాణ పనులు శనివారం ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, రాష్ట్ర రోడ్డు అభివృద్ధి సంస్థ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి, వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వెంకటాద్రిగా పిలువబడే ఈ కొండపై ఉన్న విశాలమైన స్థలంలో ఆలయాన్ని నిర్మించి, ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధ, మాజీ వైస్ ఎంపీపీ యాదిరెడ్డి, గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుకా మధుసూదన్‌రెడ్డి, వైస్ చైర్మన్ భాస్కరచారి తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణాలకు సరైన ఎంపిక 'భారతి'

సీనియర్ టెక్నికల్ ఇంజనీర్ బద్రీ



తాపీ మేస్త్రీలతో మాట్లాడుతున్న ఇంజనీర్ బద్రీ

అబ్దుల్లాపూర్‌మెట్: నిర్మాణ రంగంలో భారతి సిమెంటుకు తిరుగులేదని ఆ సంస్థ సీనియర్ టెక్నికల్ ఇంజనీర్ బద్రీ తెలిపారు. తిరుగులేని సంస్థగా ఎదుగుతున్న సంస్థ.. అల్ట్రాఫాస్ట్ పేరుతో ఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్ 5స్టార్ గ్రేడ్ తెలంగాణలో విడుదల చేసిందని ఆయన పేర్కొన్నారు. పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీలో శుక్రవారం రాత్రి ముత్యం సిమెంట్, స్టీల్స్ డీలర్ దుకాణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో తాపీ మేస్త్రీలతో బద్రీ మాట్లాడారు. మార్కెట్‌లో లభించే ఇతర సిమెంట్లతో పోలిస్తే భారతి అల్ట్రాఫాస్ట్‌తో నిర్మాణం చాలా వేగవంతంగా పూర్తవుతుందన్నారు. ముఖ్యంగా స్లాబులు, పిల్లర్లు, బ్రిడ్జిలు, రహదారులకు సరైన ఎంపికన్నారు. అల్ట్రాఫాస్ట్ వినియోగదారులకు ఉచిత సాంకేతిక సహాయం అందజేస్తామని, స్లాబ్ కాంక్రీట్ సమయంలో నిపుణులైన సంస్థ ఇంజినీర్లు సైట్ వద్దకే వచ్చి సహాయపడతారని వెల్లడించారు. భారతి అల్ట్రాఫాస్ట్‌కు రూ.20 అధికంగా ఉంటుందన్నారు. డీలర్స్ మల్లికార్జున్ రెడ్డి, రవి, అనీల్‌రెడ్డిలు మాట్లాడుతూ భారతి సిమెంట్ సర్వీస్ చాలా వేగంగా ఉందన్నారు. సమావేశంలో సంస్థ మార్కెటింగ్ విభాగం డిప్యూటీ మేనేజర్ రామకృష్ణ, 60మందికి పైగా తాపీ మేస్త్రీలు పాల్గొన్నారు.